# నేత్రపర్వం.. ఆదిదంపతుల కల్యాణం

నెల్లూరు(బృందావనం) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు, పూజలు, ఆది దంపతుల కల్యాణోత్సవాలను గురువారం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భువనేశ్వరి మూలస్థానేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి గజవాహన సేవ గావించారు. ఉభయకర్తలుగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో..

## ఉమామహేశ్వరాలయంలో..



నెల్లూరు(బృందావనం) : సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణోత్సం నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి ఏకాంతసేవ చేపట్టారు. ఉభయకర్తలుగా పెనుగొండ వెంకటచలమయ్య- మంజుల దంపతులు, మహాలక్ష్మీబాయి, కుమారులు ఎస్సీ గోపాల్‌సింగ్, కృష్ణసింగ్ వ్యవహరించారు.

## రాజరాజేశ్వరి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుందరేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గజవాహనసేవ సాగింది. ఉభయకర్తలుగా ఆల్తూరు సులోచనమ్మ, కుమారులు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్ కుమార్‌రెడ్డి, రాధిక వ్యవహరించారు.



## స్వర్ణలింగేశ్వరాలయంలో..



నెల్లూరు(బృందావనం): గణేష్‌ఘాట్ వద్ద ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు చేసి కల్యాణాన్ని తిలకించారు.

## బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): హరనాథపురంలోని బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వేడుకగా జరిగింది. ఉభయకర్తలుగా వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి- ఉషాకిరణ్ దంపతులు వ్యవహరించారు. అనంతరం నగరోత్సవం వైభవంగా సాగింది.



## క్లుప్తంగా

### దుస్తుల వితరణ



నెల్లూరు(బృందావనం) : బాప్టిస్టు చర్చి డొనీహాల్ ఆధ్వర్యంలో పడారుపల్లి సుందరయ్య కాలనీ శివారు ప్రాంతంలో 'షో యువర్ లవ్' టీమ్ సభ్యులు గురువారం దుస్తులను అందజేశారు. బృంద సభ్యులు కృపారాజస్, రవి, ప్రభావతి, మేరీబ్లెస్సింగ్సన్, మేరీసరళ పాల్గొన్నారు.

### పక్కాగా ఇంటర్ పరీక్షలు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని తన కార్యాలయంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని సూచించారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కేంద్రాల్లోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలను బిగించాలని, పరిసరాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నామని వివరించారు. పరీక్ష కమిటీ జిల్లా సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం



నెల్లూరు(అర్బన్) : వరల్డ్ ఎన్జీఓ డే సందర్భంగా స్థానిక వైకుంఠపురంలో 200 మందికి పైగా గిరిజనులకు ప్యూర్ స్మైల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, సభ్యులు పాల్గొన్నారు.

### రేపట్నుంచి అగ్నిగుండ మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో పాండురంగస్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవాలు జరుగనున్నాయని మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి గురువారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

### వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్) : సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ జి.దశరథ రామారావు తన సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధించారు. పలువురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేశారు. అనంతరం డ్రోన్ సాయంతో స్టేషన్ పరిధిలో సంతపేట, గుప్తా పార్కుసెంటర్, రైల్వేఫీడర్స్ రోడ్డు, నిర్మానుష్య ప్రదేశాలను పరిశీలించారు.

### బాధితులను ఆదుకోవాలి

నెల్లూరు(క్రైమ్) : సిరిగోల్డ్ ఆస్తులను కాపాడాలని బీజేపీ నేత మిడతల రమేష్ బాధితులతో కలిసి సీఐడీ డీఎస్పీ కోటారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ సిరిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు 15 వేల మందికిపైగా ఉన్నారన్నారు. అప్పుల బాధతో తొమ్మిది మంది ఆత్మహత్య చేసుకోగా మరో ఐదుగురు మానసిక వేదనతో మృతిచెందారన్నారు. బాధితులకు న్యాయం చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నేతలు ఎస్.సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, కె.భాస్కర్ పాల్గొన్నారు.

### 8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని మార్చి 8వ తేదీ ఉదయం 10.30 నుంచి నిర్వహించనున్నామని సీఈఓ విద్యారమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని చెప్పారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

# చెత్త నిర్వహణ గాలికి..

- తడి, పొడి చెత్త తరలింపులో అలక్ష్యం
- అవగాహన కల్పించినా ఆచరణ శూన్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించాలన్న ఎస్‌ఎంసీ కార్యాచరణ ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇళ్ల నుంచి చెత్తను వేరు చేసి తరలించేందుకు గతంలో లక్షలాది నిధులు వెచ్చించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదు. తడి, పొడి చెత్తను తరలించాలన్న అధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు.**



ట్రాక్టర్‌లో తడి, పొడి చెత్తను కలిపి తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, బాలాజీనగర్, ఎన్టీఆర్‌నగర్, బీవీనగర్, రామలింగాపురం, హరనాథపురం, మైపాడురోడ్డు, బంగ్లాతోట, మూలాపేట, రంగనాయకులపేట, ట్రంకురోడ్డు, ఫత్తేఖాన్‌పేట, మాగుంటలేఅవుట్, దర్గామిట్ట, పొదలకూరురోడ్డు, వేదాయపాళెం తదితర ప్రధాన ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలను కలిపి మొత్తం 54 డివిజన్లు ఉన్నాయి. ఇందులో దాదాపు 8 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రతి నిత్యం 300 మెట్రిక్ టన్నుల చెత్త చెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తున్నారు. వీటిలో తడిది 65 శాతం కాగా పొడిది 35 శాతం చెత్త ఉంటోంది. వీటి సేకరణకు ఏడాదికి దాదాపు రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నారు. చెత్త సేకరణకు సంబంధించిన పారిశుద్ధ్య కార్మికులు మొత్తం 1,499 మంది ఉండగా వీరిలో శాశ్వత సిబ్బంది 262 మంది కాగా అవుట్ సోర్సింగ్ ద్వారా 1,237 మంది ఉన్నారు. తడి, పొడి చెత్తగా వేరు చేసి సేకరించేలా కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛ ఆటో కార్మికులకు అవగాహన కల్పించారు. అయినా తడి, పొడి చెత్తను కలిపి ఆటో ట్రాలీల్లో అల్లీపురం రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

**విద్యుదుత్పత్తికి, సేంద్రియ ఎరువుల తయారీకి తూట్లు**

నగరపాలక సంస్థ పరిధిలో 146 చెత్త తరలించే మినీ వాహనాలున్నాయి. వీటి ద్వారా ఇళ్ల నుంచి చెత్తను సేకరించి అల్లీపురం రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించి అక్కడి నుంచి దొంతాలిలో ఉన్న పెద్ద డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్నారు. ప్రస్తుతం 50కు పైగా మినీ వాహనాలు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. మిగిలిన వాహనాలతో పాటు మరమ్మతులకు గురైన మినీ వాహనాల స్థానంలో ట్రాక్టర్లను అద్దెకు తీసుకొచ్చి చెత్తను తరలిస్తున్నారు. ఇళ్ల నుంచి వచ్చే తడి చెత్తను ఉపయోగించి విద్యుదుత్పత్తిని, సేంద్రియ ఎరువును తయారు చేసేందుకు ప్లాంట్‌ల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఆ దిశగా అడుగులు ముందుకు పడిన దాఖలాలు లేవు. దీంతో చెత్త తరలింపులో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదన్న విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

**ప్లాస్టిక్, ఇతర వస్తువుల విక్రయంపైనే దృష్టి**

చెత్త సేకరణలో వచ్చే ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేరు చేసి సమీపంలోని పాత ఇనుప సామగ్రి దుకాణాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించకుండా కార్పొరేషన్ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ అదనపు ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

**అధికారుల ఆదేశాలు బేఖాతర్**

ఇళ్ల నుంచి చెత్తను సేకరించే మినీ వాహనాల కార్మికులు తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించాలని ఎస్‌ఎంసీ అధికారులు జారీ చేసిన ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. మొదట్లో అధికారులు చొరవ తీసుకోవడంతో ఆటో ట్రాలీలను రెండు సమభాగాలుగా విభజించి తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించారు. కొద్ది రోజుల పాటు సజావుగా కొనసాగినా తరువాత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

# బాధితుడికి ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని మూడో డివిజన్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో లాండ్రీ బండి, దుస్తులు అగ్నికి ఆహుతై ఆస్తి నష్టం సంభవించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసాద్ నివాసానికి పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన నవాబుపేట సీఐకి ఫోన్ చేసి మూడో డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ ప్రాంతాల్లో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, గస్తీని ముమ్మరం చేసి ఆకతాయిల చర్యలను కట్టడి చేయాలని కోరారు. అలాగే లాండ్రీ బండిని దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాధితుడికి కొత్త లాండ్రీ బండిని అందిస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

# పెద్దాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దాస్పత్రిలోని శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్‌లో గురువారం రోగుల అటెండర్లకు అన్నదానం చేశారు. అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ తెనాలి చంద్రమోహన్ తండ్రి శివరామయ్య 28వ వర్ధంతి సందర్భంగా చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల అమరేంధర్‌రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, స్వర్ణ రమేష్‌బాబు, డాక్టర్ ఎంఎస్ రెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకట్రావు, సుబ్బరామిరెడ్డి, ఖలీల్ బేగ్, జయదేవ్, హుస్సేన్ పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు(అర్బన్) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. బుజబుజనెల్లూరులోని డీవీఎస్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు పుష్కర్ భారత్ గ్యాస్ ఏజెన్సీ సహకారంతో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్లీన్ ఎన్విరాన్‌మెంట్ త్రూ గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ అనే అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రసూల్, గ్యాస్ ప్రొప్రైటర్ సునీతలక్ష్మి, రాంబాబు, హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేత

# వలల తొలగింపు దారుణం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఆత్మకూరు నియోజకవర్గంలోని మురుగళ్ల గ్రామంలో నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన వారు చెరువులో చేపల రక్షణకు చేసుకున్న వలలను తొలగించడం దారుణమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రంజాన్ మాసానికి పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు సిటీ : మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం కార్పొరేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు. అలాగే డీఎస్పీ సింధుప్రియతో కూడా ఫోన్‌లో మాట్లాడి, పలు సూచనలు చేశారు.

## సర్వేలకు సహకరించండి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలకు ప్రజలు సహకరించాలని అదనపు కమిషనర్ వైఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అధికారులకు సరైన వివరాలను అందించి, సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సలహా మండలి సమావేశం రేపు

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని బీవీనగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో మార్చి 1న శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ లలితా శివజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పాల్గొని సమస్యలను తెలియజేయాలని కోరారు.

## పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

నెల్లూరు(బృందావనం) : పవిత్ర రంజాన్ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ముస్లిం యూత్ సేవా కమిటీ అధ్యక్షుడు ఖాలిద్ తెలిపారు. జెండావీధిలోని మసీదులో కమిటీ సభ్యులతో కలిసి గురువారం మాట్లాడారు. ఉపవాస దీక్ష కోసం నిత్యావసర సామగ్రిని కొనుగోలు చేసేందుకు రాత్రివేళల్లో సమయాన్ని పెంచాలని కోరారు. సభ్యులు సమీర్, షరీఫ్, షానవాజ్, ముజాహిద్ పాల్గొన్నారు.

# ఆదిశంకర ధ్యానమందిరంలో విశేష పూజలు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు మహాన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు, శంకరాచార్యుల వారికి పుష్పార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు చక్రాల వెంకట లక్ష్మీనరసింహశర్మ, ఆనందకుమార్ శర్మ, తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ తదితరులు అభిషేక అర్చనలు జరిపించారు. ఆదిశంకర మహిళా భక్తమండలి వారిచే సామూహిక లలితా సహస్రనామస్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ట్రస్ట్ మేనేజర్ స్వామి సమయానంద నాథ పర్యవేక్షించారు.



# ప్రైవేటుకు దీటుగా రాణించాలి



కార్పొరేషన్ కార్యాలయంలో..



ఆర్ఎస్సార్ స్కూల్లో..

నెల్లూరు(బారకాసు) : రానున్న ఇంటర్ పరీక్షల్లో ప్రైవేటు కళాశాలలకు దీటుగా మున్సిపల్ కళాశాలల విద్యార్థులు రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని మేయర్ స్రవంతి ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్లో నగరపాలక సంస్థ మున్సిపల్ జూనియర్ కళాశాల విద్యార్థులు 284 మందికి పరీక్షల సామగ్రిని మేయర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు.

➡ నెల్లూరు (టౌన్) : స్థానిక నవాబుపేటలోని చిన్న బాలయ్యనగర్, తడికల బజారులోని ఆర్ఎస్సార్ ప్రభుత్వ పాఠశాలలో ది నెల్లూరు డిస్ట్రిక్ట్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ జేవీ చలపతిరావు, సృజన సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ, చార్టెట్ అకౌంటెంట్ సుబ్బారావు, అసోసియేషన్ సెక్రటరీ విజయకుమార్, ట్రెజరర్ లీలామోహన్, పూర్వ అధ్యక్షులు శేషయ్య, శ్రీనివాసులు, సుజాత రెడ్డి, హెచ్‌ఎంలు జాస్మిన్, నాగేశ్వరమ్మ, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న రోడ్ల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక 23వ డివిజన్ పోలేరమ్మ చెట్టు సెంటర్, బ్యాంకు కాలనీ, అనగుంట ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు, పాట్ హోల్స్ గుర్తించి వెంటనే సరి చేయాలని సూచించారు. రోడ్డుపై ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు నోటీసులు జారీ చేయాలన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన ర్యాంపును తొలగించాలని, అలాగే నిర్మాణం జరిగినప్పుడు పర్యవేక్షణ ఎందుకు కొరవడిందని టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు కాలనీ పార్కు లోపల నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చి అద్దె భవనంలో ఉన్న సచివాలయాన్ని మార్పు చేయాలని సూచించారు. అనగుంట వద్ద కాలువను పగులగొట్టి ప్లాట్లకు దారిని ఏర్పాటు చేసుకున్న వారితోనే నిర్మాణం చేయించాలన్నారు. స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ శేషగిరిరావు, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



23వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్

# నగరాభివృద్ధికి బడ్జెట్‌ను రూపొందించండి

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా నూతన బడ్జెట్‌ను రూపొందించాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ రూపకల్పన సమావేశాన్ని కమిషనర్ తన చాంబర్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి నగరపాలక సంస్థకు బడ్జెట్ కేటాయింపులో భాగంగా అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని, వారి సలహాలు, సూచనలతో అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను రూపొందించాలని సూచించారు. నగర వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు నూతన బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించాలని, సంక్షేమంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిని చూపేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహనరావు, డీసీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, అకౌంటెంట్ పద్మజ, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## 87వ దఫా రక్తదానం

నెల్లూరు(అర్బన్) : నగరానికి చెందిన ఇంద్రగంటి శర్మ గురువారం 87వ దఫా రక్తదానం చేశారు. దీంతో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంసీ మెంబర్ గునపాటి ప్రసాద్‌రెడ్డి తదితరులు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో శర్మకు శాలువ కప్పి, సర్టిఫికెట్ అందించి అభినందించారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

